

# భవానీద్వీపం

## -వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 69 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

వీ బెన్ యాయ్' (ఎవరు మీరు) అంటూ లేవడానికి ప్రయత్నించాడు అప్పర్ హుడ్ (ప్రధానాధికారి) 'నికోలస్ డాంక్ వార్ట్'. ఆ ధ్వనికి ఉలిక్కిపడి లేచింది అతడి సతీమణి 'ఆనికా'. పట్టు తెరల మాటునుండి చుట్టూ కనిపిస్తున్న ఆకారాలను చూసి నిలువునా చిగురుటాకులా వణికిపోయింది. అసలే పెద్ద పెద్ద కనులు యింకా పెద్దవైనాయి. తెల్లని ముఖం యింకా తెల్లగా పాలిపోయింది.

చుట్టూ మోహరించిన పదిమందే కాక ఒకరొకరుగా నిలువెత్తు కిటికీ తలుపులు తెరుచుకుని దిగారు మరొక పదిమంది. చమురు దీపాల వెలుగులో కదులుతున్న నల్లరాతి శిల్పాల్లా మెరిసిపోతున్నారు. మూడేసి మూరల పొడవైన ఖడ్గాలు, పదునైన ఈటెలు ధరించి ఉన్నారు. దీపాల జ్వాలలకన్నా ఎర్రగా కసిగా మెరిసిపోతున్నాయి వాళ్ళ

కన్నులు. కళ్ళు మూసి తెరిచేలోపు కత్తులు ఎత్తి పట్టుకుని విశాలమైన ఆ గదికున్న ద్వారాలు కిటికీల వద్ద సిద్ధంగా మోహరించారు.

మెల్లగా చేతిని తలాపు వైపు ఆనించి ఉన్న తుపాకీవైపు కదిలించడానికి ప్రయత్నం చేశాడు డాంక్ వార్ట్. పక్కనే ముక్కాలి పీట మీద ఉన్న కంచు ఘంటను మోగించడానికి పిడిని అందుకోడానికి ప్రయత్నించింది ఆనికా. మెరుపులా మెరిసింది మూడు మూరల ఖడ్గం ఒకటి. ధారలుగా రక్తాన్ని పిచికారీ చేస్తూ భుజందాక తెగిపడింది డాంక్ వార్ట్ కుడిచేయి. కెవ్వున అరిచిన అరుపు బయటకు రాకముందే బలమైన చేయి ఒకటి అతడి నోటిని మూసింది. ఒకచేయి తామర తూడులా నాజూకుగా ఉన్న ఆనికా చేతిని ఒడిసి పట్టుకుంది. మరొక చేయి గిజ గిజలాడుతూ పెనగులాడుతున్న ఆమె నోటిని బలంగా మూసింది. డచ్చి దంపతులు స్పృహ కోల్పోయారు.

★★★★★★★★★★★★★

" వర్తులాకారంగా నిర్మించబడిన భవనాల సముదాయం అది. ప్రధానాధికారి భవనానికి సరిగ్గా ఎదురుగా ఉప ప్రధానాధికారి భవనం ఉన్నది. ఆ రెంటికీ మధ్య గుండ్రంగా మిగిలిన ముఖ్య అధికారుల భవంతులు ఉంటాయి. మధ్యన మైదానమంత విశాలమైన స్థలంలో గుడారం ఉంటుంది. అందులో రెండువందలమంది సైనికులు ఉంటారు.

నివాస భవనాల సముదాయానికి బయట వర్తులాకారంలో ఉన్న గృహ సముదాయాలలో మూడు వందల మంది సైనికులు ఉంటారు. ఆ సైనిక గృహ సముదాయం బయట చతురస్రాకారంలో దృఢమైన ప్రహరీ ఉంటుంది. ఆ ప్రహరీ వెలుపల విశాలమైన చతురస్రాకార భవన సముదాయం ఉంటుంది. అయిదు వందలమంది సైనికులకు బసచేయడానికి వసతి ఉన్నది ఆ భవన సముదాయంలో.

ఆ సముదాయానికి వెలుపలా నాలుగు ప్రక్కలా ఎకరం మేర విశాలమైన ప్రాంగణం, ఆ చుట్టూ నాగులవంచ కోట ప్రధాన ప్రహరీ గోడలు ఉంటాయి. ప్రహరీ గోడ ఒకేసారి మూడు ఎడ్ల బండ్లు వెళ్ళేంత వెడల్పుగా ఉంటుంది. నాలుగుప్రక్కలా నాలుగు ఎత్తైన బురుజులు ఉంటాయి. ఒక్కొక్క బురుజులో నలుగురేసి సైనికులు వంతులవారీగా పహారా కాస్తుంటారు.

ప్రధానమైన కోట గోడకు ఆనుకుని లోపలి వైపు తూర్పు ఆగ్నేయ దిశలో తుపాకుల గిడ్డంగి, దక్షిణ ఆగ్నేయ దిశలో మందుగుండు గిడ్డంగి ఉంటాయి. వాటికి, కోట ప్రధాన ద్వారానికి రక్షణగా మరొక ఐదువందలమంది సైనికులు ఉంటారు. దక్షిణ, పడమర నైరుతి దిశలలో సిబ్బంది కార్యాలయాలు ఉంటాయి. తూర్పున కోట సింహద్వారం ఉంటుంది.

కోట వెలుపల పత్తి బేళ్ళ గిడ్డంగుల వద్ద, నీలిమందు తొట్ల వద్ద, చుట్టుపక్కల గ్రామాల నుండి కోటకు, కోట నుండి బందరు స్థావరానికి రవాణా మొదలైన వాటికి అనుసంధానంగా మరొక ఐదువందలమంది సైనికులు పనిచేస్తూ ఉంటారు. వారు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న నీలిమందు తయారీ స్థలాలలో గుడారాలలో ఉంటారు "

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

దుబాసీ దామోదర శర్మ కంఠం వేదంలా మోగుతున్నది నాగులు చెవులలో. ఎఱ్ఱని జ్యోతులలా ఉన్న కళ్ళను గుండ్రంగా తిప్పుతూ చుట్టూ కలయ చూశాడు. ఎదురుగా మోకాళ్ళ మీద కూర్చోబెట్టి ఉన్నారు డచ్చి సైనికులు. దాదాపు అందరూ గాయపడి, బిత్తర చూపులు చూస్తున్నారు. తమ పదునైన ఆయుధాలతో వారిని కదలకుండా చూస్తున్నారు వివిధ దళాల ఉద్యమకారులు.

ప్రధాన, ఉప ప్రధాన అధికారులను భార్యా పిల్లలతో సహా అందరినీ నడిమధ్యన నిలబెట్టి రక్త సిక్తాలైన కత్తులు, బరిశలు గొంతులకు ఆనించి సిద్ధంగా ఉన్నారు నాగులు, అతడి దళ సభ్యులు. ఎదురు తిరిగిన కొందరు అధికారులను వారి పడక గదులలోనే నిర్దాక్షిణ్యంగా నరికేశారు. స్పృహలో ఉన్నవారిని, స్పృహ లేనివారిని ఈడ్చుకొచ్చి మధ్యలో పడేశారు.

కోట చుట్టూ ఉన్న రహస్య మార్గంనుండి చీమల దండులా నిశ్శబ్దంగా అధికారుల నివాస సముదాయంలోకి నాగులు దళం సభ్యులు ప్రవేశించారు. అధికారులకు, కుటుంబాలకు రక్షణగా ఉండే సైనికుల గుడారంలోకి బొమ్మకల్లు దళం సభ్యులు ప్రవేశించారు. నిద్రలో, నిర్లక్ష్యంలో మునిగిపోయిన డచ్చి సైనికులపై విరుచుకుపడి

తిరగబడిన వారి గొంతులు కోశారు. లొంగిపోయిన వారిని ఈడ్చుకొచ్చి మధ్యలో పడేశారు. గుడారంలో ఒక ప్రక్కన ఉంచిన తుపాకులను అందుకోకుండా మరొక దళం సిద్ధమై, వచ్చిన వారిని వచ్చినట్టు నరికేశారు.

'మృత దేహాలను అన్నిటినీ గుడారంలో పడేసి నిప్పు అంటించండి' అని కర్కశంగా ఆజ్ఞ జారీ చేశాడు నాగులు. ఒక నలుగురు ఉద్యమకారులు కదిలారు ఆ పని పూర్తి చేయడానికి. నిముషాలలో ఆ ప్రాంగణంలో మృతులైన సైనికుల శరీరాలను గుడారంలోకి విసిరేశారు. ఒక కాగడాను అందుకుని గుడారానికి నిప్పు అంటించాడు నాగులు.

ఫెళ ఫెళమంటూ మంటలు ఎగిశాయి. నాగులు చేతికి దొరికిన తుపాకీని గాలిలోకి పేల్చబోతుండగా ఎదురు చూడని ఉపద్రవం ముంచుకొచ్చింది. ఈ సందడిలో ఎలా ఎప్పుడు వెళ్ళాడో, ప్రధానాధికారి గదిలో కంచు ఘంటను కసిదీరా శక్తిమేరకు మ్రోగించాడు సైనికుడొకడు. దాని ధ్వనులు చుట్టూ ఉన్న కట్టడాలకు తగిలి రెట్టింపుగా ప్రతిధ్వనించాయి. ఆ ప్రతిధ్వనులు నాగులవంచ కోటలో ప్రతి మూలన తీవ్రమైన ప్రకంపనలను సృష్టించాయి.

కొన్ని క్షణాలపాటు ఆ ధ్వనులు చెలరేగాయి. ఆదమరచి నిదురిస్తున్న సైనికులు మేలుకొని తుపాకులు అందుకున్నారు. కోట ప్రధాన ద్వారంవైపు కొందరు, అధికారుల నివాస సముదాయలవైపు కొందరు పరుగులు తీశారు. నిముషాలలో తారుమారైన పరిస్థితిని గమనించాడు ముత్తారం మొండిజగ్గడు. జగ్గడు, అతడి అనుచరులు పదిమంది మందుగుండు గిడ్డంగి పక్కన అల్లంత దూరంలో పొంచి ఉన్నారు.

ప్రణాళిక ప్రకారం పద్దెనిమిది వందలమంది ఉద్యమ కారులు ఆ సరికి కోటలో, తమ తమ స్థానాలలో చేరిపోయారు. లోపల ఉన్న నాగులు నుండి సంకేతం కోసం ఎదురు చూస్తున్నారు అన్ని చోట్లా సిద్ధంగా ఉన్న ఉద్యమకారులు. ఆ సంకేతం వచ్చిన వెంటనే కాగడాలు అంటగట్టిన బాణాలు, బరిశెలు బార్లా తెరిచిన మందుగుండు గిడ్డంగిలోకి దూసుకు పోవాలి.

ఒకే ఒక్క క్షణంలో తేరుకున్నాడు మొండిజగ్గడు. తుపాకుల గిడ్డంగిని, మందుగుండు నిలవ చేసిన గిడ్డంగిని చేరుకుంటున్న వందలాది దచ్చి సైనికులను చూశాడు. 'జయ జయ ముత్తారం రామా!' అంటూ కోట ప్రతిధ్వనించేలా సింహనాదం చేశాడు. అతడి సంజ్ఞను అర్థం చేసుకున్న అనుచరులు పదిమంది కత్తులు ఝళిపిస్తూ 'జయ జయ ముత్తారం రామా' అంటూ ముందుకురికారు.

మందుగుండు గిడ్డంగి ముందున్న సైనికులు గమనించి తుపాకులు ఎక్కుపెట్టే లోపు పదిమంది సైనికులు మెడలు తెగి నేలకు కూలారు. తేరుకున్న సైనికుల తుపాకులు దద్దరిల్లాయి. తూటాల దెబ్బలకు తునకలై రాలిపోయారు ముత్తారం ముద్దుబిడ్డలు పదిమంది. ఆ సంరంభంలో ఒక్క క్షణం సైనికుల దృష్టి మరలింది. అంతే!

పిడుగులా వెళ్లి వారి మీద పడ్డాడు మొండి జగ్గడు. రెప్పపాటులో ఒక సైనికుడి చేతిలో తుపాకీని లాఘవంగా లాక్కున్నాడు. ఆ తుపాకీ దెబ్బకు గిడ్డంగి తలుపులకు మనిషి దూరేంత కంత పడింది. విచక్షణ కోల్పోయిన ఒక సైనికుడి తుపాకీ దెబ్బకు నెత్తురు చిమ్ముతూ తలుపులను బద్దలు చేస్తూ వెళ్లి లోపల పడింది మొండి జగ్గడి శరీరం. మరొక సైనికుడి తుపాకీ దెబ్బకు స్తంభాద్రి పరగణా దద్దరిల్లే ధ్వనితో మందుగుండు గిడ్డంగి పేలిపోయింది. యిదంతా రెండే రెండు లిప్తలలో జరిగింది.

ఆ పేలుడు ధాటికి సైనికుల నివాసాలు సగం నేలమట్టం అయినాయి. కోట ప్రహరీ గోడ తూర్పు, దక్షిణ దిక్కులలో పూర్తిగా ధ్వంసమైంది. నాలుగు వందలమంది డచ్చి సైనికులు నిద్రలోనే నల్లులలా మలమల మాడిపోయారు. పేలుడు ప్రణాళిక ముందే తెలుసు కనుక, ఎంత దూరంగా వెళ్ళడానికి ప్రయత్నించినప్పటికీ దాదాపు వందమంది నాగులవంచ ఉద్యమకారులు కూడా ప్రాణాలు కోల్పోయారు.

తేరుకుని ఏం జరిగిందీ తెలుసుకునేలోపు మరొక రెండువందలమంది డచ్చివారి సైనికులు ఉద్యమకారుల చేతులలో ప్రాణాలు కోల్పోయారు. అర్ధరాత్రి వేళ అదాటున జరిగిన దాడికి తేరుకుని, తుపాకులు పట్టుకునే సాహసం చేసిన డచ్చి సైనికులకు, నాగులవంచ ఉద్యమకారులకు ఆ మసక వెన్నెల రాత్రి భయంకరమైన పోరాటం జరిగింది. అది ఆ తిరుగుబాటులో చివరి పోరాటం. మరొక రెండువందలమంది ఉద్యమకారులు, నాలుగు వందలమంది డచ్చి సైనికులు ప్రాణాలు కోల్పోయారు.

కదిలి వస్తున్న కార్చిచ్చులా కాగడాలు పట్టుకున్న వేలాది మంది చుట్టుపక్కల పల్లెల స్త్రీ పురుషులు కూలిన గోడలను దాటుకుని కోటలో అడుగు పెట్టారు. వారందరినీ కదిలించిన స్త్రీల దళానికి ముందు భాగంలో నారసింహిలా గర్జిస్తున్నది నాగమణి.

(కొనసాగింపు వచ్చే సంచికలో...)



COMMENTS